అతిశయం ఘనం.. ఆచరణ శూన్యం

- నాడు ఆర్భాటంగా ఏసీ బస్‌షెల్టర్ల ప్రారంభం
- నేడు నిరుపయోగంగా దర్శనమిస్తూ..
- ఆకతాయిలకు అడ్డాగా మారుతున్న వైనం
- ప్రజాధనం వృథా



నెల్లూరు(బారకాసు): నెల్లూరులో టౌన్ బస్సుల్లో ప్రయాణించే వారికి ఇబ్బంది లేకుండా బస్టాప్‌లున్న పలు చోట్ల ఏసీ షెల్టర్లను కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేశారు. రూ.లక్షలను వెచ్చించి, అధునాతనంగా వీటిని తీర్చిదిద్దారు. అయితే వీటి వినియోగం మాత్రం మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. సరైన ప్రణాళిక, సమన్వయం లేకపోవడంతో ఇవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

గతంలోనూ ఇంతే..

వాస్తవానికి ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు ఆరు ప్రాంతాల్లో ఆరు ఏసీ బస్టాప్‌లను 2019లో నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గాంధీబొమ్మ సెంటర్, వైఎమ్సీఏ గ్రౌండ్స్ సమీపంలో, టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా, రాజరాజేశ్వరి దేవస్థానం, కరెంటాఫీస్ సెంటర్, అయ్యప్పగుడి వద్ద వీటిని నెలకొల్పారు. ఒక్కో దానికి రూ.ఎనిమిది లక్షల చొప్పున రూ.48 లక్షలను వెచ్చించారు. ఆ సమయంలో సక్రమంగా వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. తదనంతరం ఎవరూ పట్టించుకోకపోవడంతో కొన్నింట్లో చిన్న దుకాణాలనూ ఏర్పాటు చేశారు.

తాజాగా ఇలా..

గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అవే ఏసీ బస్‌షెల్టర్లను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు రూ.15 లక్షలను నగరపాలక సంస్థ వెచ్చించింది. ఏసీతో పాటు ఐరన్ కుర్చీలను ఏర్పాటు చేశారు. అయితే టౌన్ బస్సులను ఇక్కడ కాకుండా దూరంగా నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు సైతం అక్కడికే వెళ్లి నిరీక్షించాల్సి వస్తోంది. ఫలితంగా ఎండలో నానా అవస్థలు పడాల్సి వస్తోంది.

ఆకతాయిలకు కేరాఫ్‌గా..

ఏసీ బస్‌షెల్టర్లు ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. కొందరు గంటల తరబడి ఇక్కడే కూర్చొని ఫోన్లో కాలక్షేపం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో మందుబాబుల తాకిడి సరేసరి. మరోవైపు అధికారులు పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రంగా మారాయి. ఇప్పటికైనా సిటీ బస్సుల యజమానులతో సమన్వయం చేసుకొని ఏసీ బస్‌షెల్టర్ల వద్ద సర్వీసులను ఆపి.. ప్రయాణికులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బస్‌షెల్టర్‌కు దూరంగా నిలిచిన బస్సు



పిచ్చాపాటి కబుర్లు.. మొబైల్ ఫోన్లలో నిమగ్నమైన యువత

క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


కొడవలూరు: బాల్య వివాహాలతో అనర్థాలు సంభవిస్తాయని ఎమ్మెల్‌హెచ్‌పీ సుష్మ పేర్కొన్నారు. బాల్య వివాహాలతో సంభవించే దుష్ప్రభావాలపై మండలంలోని రెడ్డిపాళెం గిరిజన కాలనీలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలకు 18 ఏళ్లలోపు వివాహం చేస్తే ఆరోగ్య సమస్యలొస్తాయని చెప్పారు. గిరిజనుల్లో బాల్య వివాహాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఏఎన్‌ఎం నదియా పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలంటూ నిరసన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఎదుట శుక్రవారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. హామీలను టీడీపీ, జనసేన, బీజేపీ తుంగలో తొక్కాయని ఆరోపించారు. ప్రజలను పక్కదారి పట్టించేందుకే యోగాంధ్ర పేరుతో నెల రోజులుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని విమర్శించారు.

ప్రమాదభరితంగా స్పీడ్ బ్రేకర్లు



పొదలకూరు: మండలంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గ్రామాల్లో ఆటోలు, ద్విచక్రవాహనాలను నియంత్రించాలనే ఉద్దేశంతో వీటిని గ్రామస్తులే ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే ఇష్టానుసారంగా నిర్మిస్తుండటంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. మరుపూరులోని మెయిన్ రోడ్డు వద్ద ప్రమాదాలు జరగడంతో వీటిని గ్రామస్తులు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఇవే ప్రాణాలను హరించాయి. దీంతో స్పీడ్ బ్రేకర్ల ఎత్తును తగ్గించారు. ప్రతి గ్రామం వద్ద ఒక ట్రెండు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడంతో ద్విచక్రవాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు కొన్ని గ్రామాల్లో ఆటోలు, బస్సులను సక్రమంగా నిలపడంలేదనే అత్యుత్సాహంతో స్పీడ్ బ్రేకర్లను ఇష్టానుసారం ఏర్పాటు చేస్తున్నారు.

మర్యాదపూర్వకంగా..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కడివేటి అన్వేష్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. పూల మొక్కను అందజేసి కృతజ్ఞతలను తెలియజేశారు.

ఆదాలకు సత్కారం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో పార్టీ నగరాధ్యక్షుడు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. పార్టీ 28వ డివిజన్ ఇన్‌చార్జి నెల్లూరు మదనమోహన్‌రెడ్డి సన్మానించారు. పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, నేతలు లక్ష్మీనారాయణ, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు సహకరించాలి



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లాలో టీబీని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు సహకరించాలని జిల్లా టీబీ నివారణాధికారి, ఏడీఎం హెచ్‌ఓ ఖాదర్‌వలీ సూచించారు. నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో టీబీ కేసులను నోటిఫై చేస్తే వైద్య శాఖకు తక్షణమే సమాచారమివ్వాలని కోరారు. నారాయణ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ విశ్వకుమార్, పల్మనాలజీ హెచ్‌ఓడీ ప్రసన్న పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్లపై ధర్నా



నెల్లూరు (టౌన్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు, పుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా సెక్రటరీ షారూఖ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సింహపురి ఇంటర్నేషనల్ స్కూల్ ఎదుట ధర్నాను శుక్రవారం చేపట్టారు. పీడీఎస్‌యూ నేతలు ఆశిర్, మస్తాన్, హర్ష, అక్రమ్, పూజిత్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ప్రధాని నరేంద్ర మోదీతోనే అభివృద్ధి సాధ్యమని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. రామ్మూర్తినగర్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పించనున్నారని వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నరసింహనాయుడు, ప్రధాన కార్యదర్శులు యరబోలు రాజేష్, యశ్వంత్‌సింగ్, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్, నెల్లూరు రూరల్ కన్వీనర్ మండ్ల ఈశ్వరయ్య, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి ముక్కు రాధాకృష్ణగౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నేతలు కిరణ్, మదన్‌సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎండీకి సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డిని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నేతలు విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు బాషా, రాష్ట్ర జనరల్ సెక్రటరీ అల్తాఫ్, నేతలు ఖాదర్‌బాషా, అబ్బాస్, నవాబ్‌జానీ, జక్రియా తదితరులు పాల్గొన్నారు.

‘జోయాలుక్కాస్’లో ఆఫర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): మినీబైపాస్‌లోని జోయాలుక్కాస్ షోరూమ్‌లో ఆఫర్‌ను విద్యుత్ శాఖ ఏఈ గోపీనాథ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూమ్ మేనేజర్ అక్రమ్ మొహ్మద్, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ మాట్లాడారు. అన్ని జ్యువెలరీలు, గోల్డ్ డైమండ్స్, అన్‌కట్ డైమండ్స్, ప్లాటినమ్, సిల్వర్ జ్యువెలరీలో మజూరీపై 50 శాతం తగ్గింపును అందిస్తున్నామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యమైన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా దర్శికి చెందిన వివాహిత నెల్లూరులోని పుట్టింటికి బుధవారం వచ్చారు. ఈ క్రమంలో ఇంటి నుంచి గురువారం తెల్లవారుజామున ఆమె అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు తండ్రి గురవయ్య ఫిర్యాదు చేశారు. కుమార్తె అదృశ్యం వెనుక జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేసే ఓ వ్యక్తి ప్రమేయం ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళాత్మకంగా యోగాసనాలు



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మూలాపేటలోని బ్రాహ్మణవీధికి చెందిన ఉపాధ్యాయుడు, సూక్ష్మ కళాకారుడు గంధవళ్ల ఉమాశంకర్ మర్రి ఆకులపై వివిధ యోగా భంగిమలు, యోగా అక్షరాలను కార్వింగ్ చేశారు. – నెల్లూరు(బృందావనం)

అనధికార లేఅవుట్లు ధ్వంసం



బలిజపాళెంలో అనధికార లేఅవుట్లను ధ్వంసం చేస్తున్న జేసీబీ

నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో గుర్తించిన పలు అనధికార లేఅవుట్లపై కార్పొరేషన్ అధికారులు చర్యలను శుక్రవారం చేపట్టారు. టీడీసీపీ, ఆర్డీడీటీపీ, యూడీఏ, నగరపాలక సంస్థ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అంబాపురం, గార్డెన్ సిటీ ఎక్స్‌టెన్షన్ సర్వే నంబర్లు 68, 69, 79, 80, 81లో 17.54 ఎకరాలు.. గుడిపల్లిపాడులోని శ్రీసాయి బృందావనం స్మార్ట్ సిటీ – ఫేజ్ ఏ సర్వే నంబర్లు 279 ఏ, బీ, 281 / 1,2, 282, 286 / సీ, 287, 288, 308, 313, 314 బీ, 315, 317 ఏ, బీలోని 17.30 ఎకరాలు.. ఇదే లేఅవుట్లోని ఫేజ్ – బీలో సర్వే నంబర్లు 305, 313, 317, 318, 320లో 20 ఎకరాలు.. బలిజపాళెంలోని శ్రీసాయినగర్ – ఫేజ్ 1, 2 సర్వే నంబర్లు 957, 959, 960, 962, 1059, 1060 / ఏ,బీ,లో 10.83 ఎకరాలను గుర్తించారు. ఆయా లేఅవుట్లలో నిర్మించిన ప్రహరీలను జేసీబీలతో కూల్చేసి, రోడ్లను ధ్వంసం చేశారు. అనుమతుల్లేని లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసి మోసపోవద్దని, తెలియకుండా కొనుగోలు చేసినా అందులో భవన నిర్మాణాలకు అనుమతులు రావని, రిజిస్ట్రేషన్లు కావని కమిషనర్ నందన్ తెలిపారు.

ఉత్సాహంగా యోగా కార్యక్రమం



డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో..



చిన్నబాలయ్యనగర్ మున్సిపల్ హైస్కూల్లో..



పుత్తా ఎస్టేట్స్‌లో..

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగా ప్రాధాన్యాన్ని పతంజలి యోగా యువభారత్ జిల్లా ఇన్‌చార్జి కోటేశ్వరరెడ్డి వివరించారు. అనంతరం ఇంటర్ పరీక్షల్లో కెమిస్ట్రీలో 60కు 60 మార్కులు సాధించిన మైథిలీ, రమణమ్మకు రూ.పది వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అధ్యాపకుడు కొండయ్య అందజేశారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ గిరి, రమణారెడ్డి, ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు, డీవీఈఓ మధుబాబు, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రసన్న, భారతి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

- చిన్నబాలయ్యనగర్‌లోని మున్సిపల్ హైస్కూల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి బాలబ్రహ్మచారి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.
- నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో హరిత యోగా, ఏక్ పేడ్.. మా కే నామ్ కార్యక్రమాలను నాయగో ఎడ్యుకేషన్ ట్రస్ట్, ఆయుష్, ఎన్నెస్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేసీ కార్తీక్ మాట్లాడారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, యగ్నేష్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బారకాసు): పుత్తా ఎస్టేట్స్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఎస్టేట్ మహిళా వాకర్స్ ప్రెసిడెంట్ పర్వీన్, సెక్రటరీ నళిని, ట్రెజరర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పూడికతీత పనులు



సిల్ట్ తొలగింపును పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు) : నగరంలోని కాలువల్లో పూడికతీత పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కాలువల పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. డివిజన్ పరిధిలో చేపట్టిన వివిధ ఇంజినీరింగ్ సివిల్ వర్కుల్లో నిర్మాణ ప్రగతిని పరిశీలించి కాంట్రాక్టర్లకు వివిధ సూచనలు చేశారు. పనులను నాణ్యతతో నిర్దేశించిన సమయంలోపు పూర్తయ్యేలా ఇంజినీరింగ్ విభాగాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

- టౌన్‌ప్లానింగ్ విభాగ అనుమతుల మేరకే భవన నిర్మాణాలు జరిగేలా వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులరైజేషన్ కార్యదర్శులు పర్యవేక్షించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులకు విరుద్ధంగా నగరంలో నిర్మించిన అన్ని భవనాలకు చార్జిషీట్లను దాఖలు చేయాలని సూచించారు. నగరంలో పోస్టర్లు, ఫ్లెక్సీల్లేకుండా పర్యవేక్షించాలని, అనుమతుల్లేని ప్రచార సామగ్రిని వెంటనే తొలగించాలని పేర్కొన్నారు. సిటీ ప్లానర్ హిమబిందు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై మహావిష్ణు విహారం



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో కొలువైన మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గరుడసేవను వేడుకగా శుక్రవారం నిర్వహించారు. స్నపన తిరుమంజనం, ధన్వంతరి అష్టాక్షరి హోమాలు, మహాకుంభారాధన తదితర పూజా కార్యక్రమాలను భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థాన స్థానాచార్యుడు కొమాండూరు ఇళయవిల్లి స్థలశాయి ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా మేడికొండ పద్మామోహన్, స్నేహ దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య తదితరులు పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరి సన్నిధిలో పూజలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలను శుక్రవారం నిర్వహించారు. రాహుకాల పూజలను జరిపారు. 35 మంది భక్తులు హాజరై అమ్మణ్ణికి చీర, జాకెట్టు, 108 నిమ్మకాయల మాలను సమర్పించారు. వేద పారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు, పల్లకిసేవను నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.





వేడుకగా రంగడి గోపురోత్సవం

నెల్లూరు(బృందావనం): రేవతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో తిరుమంజనం, గోపురోత్సవాన్ని వేడుకగా శుక్రవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా సోమిశెట్టి గురుప్రసాద్, రాజేశ్వరి దంపతులు తదితరులు వ్యవహరించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

- శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగడ్ని ఎస్పీ కృష్ణకాంత్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరిని ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.